# విజయవాడ వార్త

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలుచేస్తుంది: మంత్రి నాగార్జున

బాపట్ల,డిసెంబర్12,ప్రభాతవార్త: రైతులను అదుకోవడానికి తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జున అన్నారు.ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి పంట ఒదులను కోల్లూరు మండలం రావికం పాడు గ్రామంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి మంత్రి నాగార్జున సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగాజర్జున మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.రైతులకు ఎటువంటి నష్టం లేకుండా న్యాయబద్దంగా పంటల నష్టం అంచనాలననమోదు చేస్తామన్నారు.రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వమే మద్దతు ధరకు ధాన్యం కోనుగోలు చేస్తుందన్నారు.బాపట్ల జిల్లాలో అకాల వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ముఖ్యంగా వరి పంటలు సాగు చేసినరైతులు ఎక్కువగా దెబ్బతిన్నారన్నారు.

## ప్లాంట్‌లో నూతనంగా రెండు ఎంట్రన్స్ గేట్లను ఏర్పాటు చేయాలి : వీఎంసి కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 12,ప్రభాతవార్త: ఎక్సెల్ ప్లాంట్‌లో నూతనంగా రెండు ఎంట్రన్స్ గేట్లను ఏర్పాటు చేయాలని, ఎంట్రన్స్ గేట్ల నుండి వే బ్రిడ్జి వరకు రోడ్డును వేయాలని మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు.



సోమవారం ఆయన సింగ్‌నగర్ లోని ఎక్సెల్ ప్లాంట్‌ను అధికారులతో కలిసి పర్యటించి,అక్కడ జరుగుతున్న అభివృద్ధిపనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్లాంట్ ఆవరణలో ఎక్కడెక్కడ ఏమేమి వస్తాయో మార్కింగ్ చేసి చూపించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్లాంట్ ఆవరణలో జరుగుతున్న రోడ్ల పనులను త్వరగా పూర్తి చేయాలని,ప్లాంట్‌లో ఉన్న ఐకానిక్ పార్కులో జరుగుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు.ఈ పర్యటనలో అదనపు కమీషనర్(ప్రాజెక్ట్స్)కెవి సత్యవతి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏఎస్ఎన్ ప్రసాద్,శానిటరీ ఇనస్పెక్టరుల ,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘాట్లను ఎళ్ళవేళలా పరిశుభ్రంగా ఉంచాలి

విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 12,ప్రభాతవార్త: ఘాట్లలో మెరుగైన పారిశుధ్య పరిస్థితులను నెలకొల్పి ఎల్లవేళలా వాటిని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 15 నుండి భవానీ మాలల విరమణల సందర్భంగా భవానీ ఘాట్,దుర్గా ఘాట్,పున్నమిఘాట్ తదితర ప్రాంతాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో భక్తులకు అందుబాటులో ఉంచిన వసతుల గురించి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఘాట్‌ల వద్ద



భక్తులను నది లోపలికి వెళ్లకుండా నది లోపల ఏర్పాటు చేసిన ఇనుప మెస్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఘాట్‌ల వద్ద నిరంతరం సిబ్బంది విధుల్లో ఉండి పరిసరాలన్ని పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, భక్తులెవరూ వ్యర్థాలు,వారు వేసుకున్న బట్టలు నదిలో పడేయకుండా చూడాలని ఘాట్ ఇన్‌ఛార్జి అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ యం.ప్రభాకరరావు,చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణమూర్తి,హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్‌బాబు,డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్,శానిటరీ సూపర్‌వైజర్లు,శానిటరీ ఇనస్పెక్టర్లు,శానిటరీ సెక్రటరీలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా ఫారెస్ట్ అధికారుల క్వార్టర్స్

### -- జాడలేని ఇన్‌చార్జ్ ఉద్యోగులు

ఎ కొండూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండల కేంద్రం క్రాస్‌రోడ్డు నుండి విస్సన్నపేట వెళ్లే రహదారిలో ఫారెస్టుశాఖ అధికారులు నిర్మించిన ఎ కొండూరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, చీమలపాడు బీట్ ఆపీసర్‌ల క్వార్టర్స్ 2011లో ప్రారంభించగా, నేడు అవి అధికారుల నివాసం లేక నిరుపయోగంగా, ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు క్వార్టర్స్‌ల వద్ద స్థానికంగా దగ్గరలో ఉన్న కొందరు ఆవాస ప్రజలు తలుపులు పగులగొట్టి



వరాండాలో పశువులను కట్టివేసి పశువుల కొట్టాలుగా మార్చారు. ఈ క్వార్టర్స్ విషయం ఈ విధంగా ఉండగా గతంలో పనిచేసిన ఫారెస్టర్ విశాఖ పట్నానికి ట్రైనింగ్ నిమిత్తం వెళ్ళగా, చీమలపాడు బీట్ ఆఫీసర్ అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నారు. అసిస్టెంట్ బీట్ ఆపీసర్‌ను బదిలీ చేశారు. ఈ మండలంలో ప్రస్తుతం ఫారెస్ట్ శాఖలో పనిచేసే ఉద్యోగులు ఇన్‌చార్జ్‌లుగా పనిచేస్తుండటంతో వారు పట్టణాల్లో ఉన్న టింబర్ డిపోలకే పరిమితమై, ఫారెస్ట్ అడవుల సంరక్షణ, ఇంకా ఇతర కలప అక్రమ రవాణా, తప్పుడు పర్మిట్లతో టేకు రవాణా జరుగుతున్న తిరువూరు నియోజకవర్గంలో పట్టించుకునే నాధుడే లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఫారెస్ట్ శాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాలని, అలాగే ఈ మండలంలో ఖాళీగా ఉన్న వాటిని భర్తీ చేయాలని, ఇన్‌చార్జ్‌ల వల్ల ఉపయోగం లేదని నియోజకవర్గ ప్రజలు ఆరోపించారు.

## భూపోరాట యోధుడు సుంకర

ఎ కొండూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త :కమ్యూనిస్ట్ పార్టీ ఉద్యమనేత, భూపోరాట యోధుడు కామ్రేడ్ సుంకర వీరభద్రరావు 32వ వర్ధంతిని ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు సిపిఐ కార్యాలయంలో సోమవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కామ్రేడ్ తూము కృష్ణయ్య, కామ్రేడ్ ఎస్ నాగుల్‌మీరా, కామ్రేడ్ కొత్తపల్లి సుందరరావు పాల్గొని మాట్లాడుతూ స్వర్గీయ కామ్రేడ్ వీరభద్రరావు, భూమి కోసం, భుక్తి కోసం, అణగారిన వర్గాల ప్రజల కోసం



చేసిన సేవలను కొనియాడారు. కామ్రేడ్ వీరభద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# మౌలిక సదుపాయాల్లో ఎదుర్కొనే ఇబ్బందులపై దృష్టి సారించాలి: కమీషనర్

### స్పందనలో 19 అర్జీల స్వీకరణ
### అర్జీలకు సత్వర పరిష్కారం: మేయర్ భాగ్యలక్ష్మి ఆదేశం

విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 12,ప్రభాతవార్త: నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో మౌలిక సదుపాయాల్లో ఎదుర్కొనే ఇబ్బందులపై దృష్టి సారించాలని మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్పందనలో వచ్చే సమస్యలన అర్జీలపై సత్వర పరిష్కారాన్ని చూపాలని మేయర్ భాగ్యలక్ష్మి అధికారులకు సూచించారు.సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వీరిరువురు 19 అర్జీలను స్వీకరించారు. వీటిలో అదనపు కమీషనర్(జనరల్)-1,పబ్లిక్ హెల్త్ విభాగం-2,ఎస్టేట్ విభాగం-1,ఇంజనీరింగ్ విభాగం-5,పట్టణ ప్రణాళికా విభాగం-4,రెవిన్యూ-3,యుసిడి -3కు చెందిన అర్జీలను స్వీకరించారు.సర్కిల్-2 కార్యాలయంలో రెవిన్యూ-1,హౌసింగ్-1,సర్కిల్-3 కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం-1,ప్రణాళికా విభాగం-1 అర్జీలను అందుకున్నారు.కార్యక్రమంలో అదనపు కమీషనర్(జనరల్)యం.శ్యామల,చీఫ్ ఇంజనీర్ యం.ప్రభాకరరావు,చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి,ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల,డిప్యూటీ కమీషనర్(రెవిన్యూ) డి.వెంకటలక్ష్మి,జాయింట్ డైరెక్టర్(అమృత్) డాక్టర్ కెటిబిఎన్ఎస్ లత,సిటీ ప్లానర్ జివిజిఎస్‌వి ప్రసాద్,ఏడిహెచ్ శ్రీనివాస్,మేనేజర్ బి.శ్రీనివాసరావు,ఇతర అధికారులు పాల్గొన్నారు.




## మా ప్రభుత్వం వస్తే ఎస్సీ రిజర్వేషన్లు చట్టబద్ధం చేస్తాం

### - ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌జె ప్రకాష్

విజయవాడ, డిసెంబరు 12, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర విస్తృత సాయి సమావేశం సమితి రాష్ట్ర ప్రెసిడెంట్ ఆర్‌జె ప్రకాష్ మాదిగ అధ్యక్షతన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం షెడ్యూలు కులాల రిజర్వేషన్‌ల విభజన చట్టం పార్లమెంటులో ప్రవేశ పెట్టడంలో విఫలమయ్యారన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ మాదిగలకు మాయమాటలు చెప్పినట్లు స్పష్టంగా అర్ధమవుతోందని, మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే



100 రోజుల్లో చట్టం చేసి చట్టబద్దత కల్పిస్తామన్నారు. ఏ వ్యవస్థకైనా నిర్మాణం అవసరం గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు మన శ్రేణులను బలంగా నిర్మించుకోగలిగామన్నారు. 2021లో సుప్రీంకోర్టులో ఐదు మంది ధర్మాసనం ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఈవిషయంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ప్రత్యేకమైన చొరవ తీసుకొని మాదిగ ఉపకులాలకు న్యాయం జరిగేలా తాత్కాలిక అమలు జరిగేలా ఉత్తర్వులు అమలు జరపాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు ఎర్రగుడి కృష్ణన్న మాదిగ, రాయదుర్గం ఈశ్వరయ్య మాదిగ, రాజు పండిట్ మాదిగ, మాల్యాద్రి మాదిగ, ఏసి వెంకట సుబ్బయ్య మాదిగ, న్యాయ వ్యవహారాల కమిటీ అధ్యక్షులు డా.జి.బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నత్తనడకన సచివాలయాల భవన నిర్మాణం

చాట్రాయి,డిశంబరు12,ప్రభాతవార్త: ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశ పెట్టిన సచివాలయాల నిర్మాణం నత్తనడక నడుస్తోంది. చాట్రాయి మండలంలో 18 గ్రామ సచివాలయాలు ఉండగా అన్ని గ్రామాలలో సచివాలయాల నిర్మాణానికి శంఖుస్థాపనలు చేసి దాదాపుగా రెండేళ్లు పూర్తి అయింది. దీనితో పాటుగా రైతు భరోసా కేంద్రాలు కూడా నిర్మాణం చేసేందుకు శంఖుస్థాపన చేశారు. శిలాఫలకాలు శిధిలావస్థకు చేరుతున్నా కొన్ని గ్రామాలలో ఒక్క అడుగు కూడా ముందుకు వేసిన దాఖలాలు లేదు. సచివాలయ భవన నిర్మాణానికి షుమారు 45 లక్షలు మంజూరు చేయగా మండలంలో చిత్తపూరు గ్రామంలో మాత్రం



పునాదులతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా సదరు భవనాలు నిర్మాణానికి స్థలాలు వితరణగా ఇచ్చిన దాతలు కూడా నిరుత్సాహంగా ఉన్నారు. గ్రామం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశ్యంతో తమ స్థలాలని వితరణగా ఇచ్చామని పనులు జరగకపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధి జరగాలనే తలంపుతోనే తాము స్థలాలను దానంగా ఇచ్చామని చిత్తపూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దామెర చిట్టిబాబు అన్నారు. భవనాలు కట్టలేని పక్షంలో మా స్థలాలను మాకు తిరిగి ఇచ్చివేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. 2020లో డిశంబరు 27న శంఖుస్థాపన చేశారని పునాదుల నుండి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాదికారులు జోక్యం చేసుకొని వెంటనే పనులు ప్రారంభం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో తమ భూములను మాకు అప్పగించాలని ఆయన కోరుతున్నారు.మండలంలో కేవలం చాట్రాయి,నర్శింహరావుపాలెం,కోటపాడు గ్రామాలు మినహ మిగిలిన గ్రామాలలో మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. వడ్డీలకు తెచ్చి కొంతమేర కట్టినా పైసా బిల్లు రాకపోవటంతో నష్టపోవాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు బోరున విలపిస్తున్నారు.దీనితో పిచ్చిమొక్కలు మొలిచి ఆధ్వాన్నంగా తయారయ్యాయి.

**కట్టిన భవనాలకు విడుదలకాని నిధులు**

అదే విధంగా మండలంలో పలు గ్రామాలలో సచివాలయ భవనాలు ఆ గ్రామానికి చెందిన వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వంత నిధులతో పూర్తి చేసినప్పటికీ పైసా పైకం రాకపోవటంతో ఆవేదనతో ఉన్నారు. కొన్ని గ్రామాలలో పూర్తి అవ్వగా మరికొన్ని గ్రామాలలో వివిధ దశలలోనే నిలిచిపోయి దర్శనమిస్తున్నాయి.

## అమరావతినే ఏకైక రాజధానిగా ప్రకటించాలి: లోక్‌సభలో ఎంపి 'గల్లా'

గుంటూరు అర్బన్, డిసెంబర్ 12, ప్రభాతవార్త : అమరావతినే ఏపికి ఏకైక రాజధానిగా ప్రకటించాలని తెలుగుదేశం పార్టీ గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్ పేర్కొన్నారు.సోమవారం లోక్‌సభలో ఎంపి గల్లా మాట్లాడుతూ జీవనాడి లాంటి పోలవరం రాష్ట్ర తాగునీటి అవసరాలను తీరుస్తుందన్నారు.ప్రాజెక్టు నిర్మాణం కోసం సవరించిన అంచనాలను ఆమోదించి అందుకు అనుగుణంగా నిధులను కేంద్రం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చినటువంటి హామీలన్నింటిననీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.విభజన చట్టంలో పదేళ్ళు ప్రత్యేకమని చెప్పిన నిబంధన త్వరలో ముగియనున్న నేపధ్యంలో వీటిపైన ప్రత్యేకంగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

## 'స్పందన'లో 63 ఫిర్యాదులు

విజయవాడ క్రైం,డిసెంబరు 12,ప్రభాతవార్త: నగర పోలీస్ కమీషనర్ క్రాంతి రాణా టాటా ఆదేశాల మేరకు రూరల్ డిసిపి మేరీ ప్రశాంతి సోమవారం పోలీస్ కమీషనర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి,ప్రజల నుండి 63 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో నగదు లావాదేవీలకు సంబంధించి-13,భార్యాభర్తలు,కుటుంబ కలహాలకు సంబంధించి-12,సివిల్ వివాదాలకు సంబంధించి-9,వివిధ మోసాలకు సంబంధించి 10,త్వరగా దర్యాప్తు పూర్తి చేయాల్సిందిగా-1,ఇతర చిన్న చిన్న వివాదాలు,సమస్యలు,సంఘటనలకు సంబంధించి-19 ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు. నడవలేని వికలాంగులు,వృద్ధుల వద్దకు నేరుగా వెళ్ళి వారి సమస్యల గురించి అడితి తెలుసుకొని వారికి సత్వర పరిష్కారానికి జూం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలతో నేరుగా అప్పటికప్పుడు ఫిర్యాదు గురించి వివరించి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.



## సమగ్ర శిక్ష వర్క్, ఆర్ట్ అండ్ పిఈటి ఇన్‌స్ట్రక్టర్లను పార్ట్ టైమ్, ఫుల్‌టైమ్ ఎంప్లాయీస్‌గా చేయాలి

విజయవాడ, డిసెంబరు 12, ప్రభాతవార్త : ఏపి ఏజెసి అమరావతి చైర్మన్ బొప్పరాజు, సెక్రటరీ జనరల్ వైవిరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ హైస్కూల్స్‌లో పార్ట్ టైమ్ పనిచేసే సమగ్ర శిక్ష వర్క్, ఆర్ట్ అండ్ పిఈటి ఇన్‌స్ట్రక్టర్ల పక్షాన "ఆంధ్రప్రదేశ్ వర్క్, ఆర్ట్ అండ్ పిఈటి ఇన్‌స్ట్రక్టర్ యూనిటీ వెల్ఫేర్



ఆంధ్రప్రదేశ్ వర్క్, ఆర్ట్ అండ్ పిఈటి ఇన్‌స్ట్రక్టర్ యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు సైకం శివకుమారి రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న ఏపి ఏజెసి అమరావతి చైర్మన్ బొప్పరాజు, సెక్రటరీ జనరల్ వైవిరావు తదితరులు

అసోసియేషన్ అధ్యక్షురాలు సైకం శివకుమారి రెడ్డి మరియు సిబ్బంది సర్వశిక్ష అభియాన్ స్టేట్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు.ఐఏఎస్ ను కలిసి ప్రధానమైన సమస్యల పరిష్కారం చేయమని వినతి పత్రం అందచేయడమైనది. ప్రతి నెలా జీతాలు ఎంఈవో సంతకాలు లేకుండా హెడ్‌మాస్టర్ సంతకాలతో జీతాలు చెల్లించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు చేయాలని కోరారు. సాధారణ ఉద్యోగుల వలే మెడికల్ లీవ్స్, మహిళా ఉద్యోగినులకు 5 రోజుల ప్రత్యేక శెలవు, ఇఎస్ఐ అండ్ ఇపిఎఫ్ కూడా వర్తింపచేయాలన్నారు. 14వేల నుండి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు టైం స్కేల్ ఇవ్వాలని కోరారు. పార్ట్ టైమ్ నుండి ఫుల్‌టైమ్ ఉద్యోగులుగా మార్చలని వారిని కోరారు. కార్యక్రమంలో ఏపి జెఏసి అమరావతి సెక్రటరీ జనరల్ వైవి రావు, ఏపిఆర్ఎస్ఎ కోశాదికారి గిరికుమార్ రెడ్డి, విఆర్వో సంఘం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభానికి నోచుకోని సచివాలయాలు

ఎ కొండూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలంలో 14 సచివాలయ గ్రామాల్లో ఏ ఒక్క గ్రామాల్లో కూడా నేటివరకు సచివాలయ భవనాలను ప్రారంబించకపోవడం గమనార్హం. ఈ మండలంలో మాధవరం, చీమలపాడు గ్రామాల్లోని సచివాలయ భవనాల నిర్మాణం పూర్తయినా, ప్రారంభం కొరకు స్థానిక ఎమ్మెల్యే కోసం నాయకులు ఎదురు చూస్తున్నారు. ఎ కొండూరు, కంభంపాడు, రామచంద్రాపురం తదితర గ్రామాల్లో నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, కొన్ని గ్రామాల్లో బేస్‌మెంట్ లెవెల్ వరకు వచ్చివున్నాయి. ఈ మండలంలో సచివాలయ భవనాల నిర్మాణమే నత్తనడక కొనసాగుతుండగా, రైతు భరోసా (ఆర్‌బికె) గ్రామీణ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది. ప్రభుత్వం నుండి తమకు నిర్మాణ పనులు పూర్తి చేయడానికి నిధులు రావడం లేదని కొందరు పార్టీ నాయకులు నిట్టూర్పు వహిస్తున్నారు. ఇకనైనా ఈ మండలంలో సచివాలయ ఆర్‌బికె, హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణం పూర్తి చేయటానికి నిధులు రావడంలేదని కొందరు పార్టీ నాయకులు నిట్టూర్పు వహిస్తున్నారు. ఇకనైనా ఈ మండలంలో సచివాలయ, ఆర్‌బికె, హెల్త్‌క్లీనిక్‌ల నిర్మాణం పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రాంత ప్రజలు, రైతులు, వ్యాధిగ్రస్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



చీమలపాడులో నిర్మాణం పూర్తి చేసుకున్న దృశ్యం, అరకొర సౌకర్యంతో అద్దె పెంచిన పెంకుటిల్లు (ఎడమ)

